క్లుప్తంగా

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరం ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగో తరగతి చదువుతున్న బీసీ బాలికలు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థినులు ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌పోర్టల్‌లో మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పెరటి తోటల పెంపకంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రకృతి వ్యవసాయం, పెరటి తోటల పెంపకంపై 80 అడుగుల రోడ్డులోని ఆరామ ద్రావిడ సంఘం భవనంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా పెరటి తోటల పెంపకానికి కావలసిన పరిస్థితులపై అవగాహన, ప్రాథమిక వనరులు, పంచభూతాలైన భూమి, గాలి, నీరు, అగ్ని, ఆకాశంపై అవగాహన కల్పించారు. రసాయన, ప్రకృతి వ్యవసాయం మధ్య తేడా, మొక్కకు కావలసిన 108 మూలకాలు, సూక్ష్మ పోషకాలు, భూమి, ఆరోగ్యం, దేశీయ విత్తనాలు, వానపాములు గురించి ఆర్ట్ ఆఫ్‌లివింగ్ టీచర్ డి.రవి వివరించారు. వ్యవసాయానికి అవసరమైన బీజామృతం, జీవామృతం, ఆచ్ఛాదన, వాప్సా కోసం తెలియజేశారు. కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ కె.ఎస్.ఎన్.మూర్తి ఉన్నారు.

ముగిసిన యోగా తరగతులు



ముగింపు కార్యక్రమంలో సాధకులు, టీచర్లు

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పదిరోజులుగా పెద్దపాడులో నిర్వహిస్తున్న హ్యాపీనెస్ కార్యక్రమం శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. రవిశంకర్ గురుజీ ఆదేశానుసారంగా యోగా సాధన, సేవ ప్రతి ఒక్కరూ చేయాలని అన్నారు. సుదర్శన క్రియవలన మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయని, మనలో నైపుణ్యత వెలికి తీయడమే కాకుండా ఒత్తిడి లేని జీవితాన్ని సొంతం చేస్తుందని చెప్పారు. ఏఓఎల్ టీచర్ దేసూళ సురేంద్ర మాట్లాడుతూ.. మనం చేయవలసిన పనులు సక్రమంగా చేయడమే కర్మయోగమని అన్నారు. కార్యక్రమంలో ఏఓఎల్ టీచర్ కింతలి గోవింద్, వలంటీర్లు శ్రీనివాసరెడ్డి, కాత్యాయని, రూపవతి, రేణుక, రజని పాల్గొన్నారు. అనతరం జరిగిన సత్సంగంలో చౌదరి శ్రీనివాస్, ఉమాదేవి బృందం చక్కనైన భక్తిగీతాలను ఆలపించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నారాయణ తిరుమలలో పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి ప్రసాదాన్ని అందజేశారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. అలాగే చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పూలమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

రాజశ్యామల నవరాత్రులు ప్రారంభం



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో నిర్వహించనున్న రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక కుంకుమార్చనలు, రాజశ్యామల యంత్ర పూజలు, హోమాలు నిర్వహించారు.

ప్రగతి బాట!



కొత్తగా వేసిన న్యూకాలనీ రోడ్డు.

- రాజమార్గాలకు కేరాఫ్‌గా నగర రోడ్లు
- రోడ్ల నిర్మాణాలకు రూ. 18.5 కోట్లు ఖర్చు
- ఆనందం వ్యక్తం చేస్తున్న నగరవాసులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడం, జేబులు నింపుకోవడం టీడీపీ నేతలకు వెన్నతోపెట్టిన విద్య. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందుకు భిన్నంగా సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేశారు. ఒక్క శ్రీకాకుళం నగరంలోనే రూ. 18.5 కోట్లు వెచ్చించి చక్కనైనా రహదారులను నిర్మించారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి.. నాణ్యతా ప్రమాణాలతో రోడ్లు పనులు పూర్తిచేయించిన ఘనత రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకే దక్కింది.

గత సర్కార్ నిర్లక్ష్యం

పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా రోడ్లను అభివృద్ధి చేయడంలో గత టీడీపీ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇరుకైన రోడ్లతో తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. జిల్లా ప్రజలంతా వైద్యం, విద్య కోసం, కలెక్టరేట్ పనుల నిమిత్తం నిత్యం శ్రీకాకుళానికి రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ సరిపడా రోడ్లు వేయడంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. దీంతో నగరంలో ఉమెన్స్‌కాలేజ్ రోడ్డు, 80 అడుగుల రోడ్డు ఆరంభంలో ఉన్న మిల్లు జంక్షన్, సూర్యమహాల్ కూడలి, పాతబస్టాండ్ మార్గాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉండేవి. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో నగరంలో రోడ్లు, కాలువలు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కోట్లాది రూపాయల నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి అభివృద్ధి చేశారు. కార్పొరేషన్ పరిధిలో మెయిన్ రోడ్ల నుంచి వీధుల్లో ఉండే చిన్న చిన్న రోడ్లు, అప్రోచ్‌రోడ్లు, జిల్లా పరిషత్, పొట్టి శ్రీరాములు మార్కెట్, కొత్తపేట, న్యూకాలనీ రోడ్లను, ఏడురోడ్ల కూడలి నుంచి పీఎస్ఎన్ఎం స్కూల్ వరకు, ఉమెన్స్‌కాలేజీ రోడ్డు, ఆదివారంపేట నుంచి కొత్తరోడ్డు వరకు నగరంలో ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. అవసరమైనచోట కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీనికి సుమారు రూ 18.5 కోట్లు నిధులు ఖర్చు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. మిల్లు జంక్షన్ వద్ద ఉండే మలుపు ప్రమాదాలకు పిలుపుగా ఉండేవి. ఈ రోడ్డుని వెడల్పు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేశారు. అంతేకాకుండా వర్షం పడితే రోడ్ల పైనే నీరు నిలిచిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పుడా పరిస్థితి నుంచి విముక్తి కల్పించారు. డే అండ్ నైట్ వద్ద అండర్ డ్రేనేజీని సైతం పూర్తిస్థాయిలో పనులు చేసి వర్షంనీటి ఇబ్బందులు తొలగించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అటువైపుగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రయాణించినా వారెవ్వరికీ ఆ రోడ్ల దుస్థితి కానరాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు సౌకర్యాల్ని కల్పిస్తున్నారు.



సుందరంగా 80 అడుగుల రోడ్డు

సుందర నగరమే లక్ష్యం



నగరంలో రోడ్లన్నీ ఇప్పటికే అభివృద్ధి చేశాం. పెరిగిన జనాభాకు అనుగుణంగా రోడ్లను వెడల్పు చేస్తున్నాం. పాలకొండ రోడ్డు విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేసేందుకు వేగవంతం చేస్తాం. కార్పొరేషన్‌లో ప్రజలంతా ఎటువంటి ప్రమాదాలు బారిన పడకుండా రహదారులు వెడల్పు చేస్తున్నాం. శ్రీకాకుళం కార్పొరేషన్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. మోడల్ కార్పొరేషన్‌గా తయారు చేస్తాం.

–తమీమ్ అన్సారియా,
నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

రన్‌వేను తలపిస్తున్న రోడ్డు



శ్రీకాకుళం నగర రోడ్లు గతంలో గుంతలతో ఇరుకుగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ రన్‌వేని తలపించేలా ఉన్నాయి. ప్రధానంగా మిల్లు జంక్షన్‌రోడ్డు, న్యూకాలనీ రోడ్లు, ఆదివారంపేట నుంచి కొత్తరోడ్డు వరకు, జిల్లా పరిషత్ రోడ్డులు చాలా బాగున్నాయి. గతంలో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భయంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

– పిల్లల సతీష్‌కుమార్,
ఏపీహెచ్‌బీకాలనీ, శ్రీకాకుళం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి



మాట్లాడుతున్న ఎస్‌డీసీ పద్మావతి

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్న 309 పోలింగ్ కేంద్రాల్లోని సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల నియమించిన సెక్టర్ అధికారులు, మండల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 172 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని, ఇందులో 54 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ పోలింగ్ కేంద్రాలు ఏలా ఉన్నాయని, గత ఎన్నికల్లో నమోదైన కేసుల వివరాలు, పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, భవనాల స్థితి, ఇంకేమైనా చేర్పులు, మార్పులు చేయాలా తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. మత, కుల పరమైన ఘటనలు జరిగే సూచనలు ఏమైనా ఉన్నాయా అనే అంశంపైన రెండు రోజుల్లో సెక్టర్ అధికారులు పూర్తి నివేదిక అందించాలన్నారు. ఈ నెల 20వ తేదీ లోగా అన్నీ పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు, నాలుగు మండలాల తహసీల్దార్లు రామారావు, ఆదిలక్ష్మి, శ్యామ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, ఎస్సైలు చిరంజీవి, గోవిందరావు, స్వామినాయుడు, మధుసుదనరావు పాల్గొన్నారు.

బదిలీ డీఎస్పీకి సత్కారం



సన్మానగ్రహీత డీఎస్పీ వాసుదేవ్‌తో సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: దిశ డీఎస్పీగా పనిచేస్తూ విజయనగరం బదిలీపై వెళ్తున్న ఎస్.వాసుదేవ్‌ను నగరంలోని దిశ మహిళా పోలీసు కార్యాలయంలో సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ..జిల్లాలో మూడు సంవత్సరాలకుపైగా పనిచేశానన్నారు. ఈ సమయంలో మహిళలు, బాలికలకు సంబంధించి కేసుల పరిష్కారంలో పాలుపంచుకునే అవకాశం రావడం సంతృప్తినిచ్చిందన్నారు. భార్యాభర్తలు విడిపోయేందుకు ఎక్కువగా వారిలో ఉన్న చిన్న మనస్పర్థలే కారణమన్నారు. అలాంటి పలు కేసులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించినట్టు చెప్పారు. అలాగే పోక్సో కేసులకు సంబంధించి తన హయాంలో మూడు కేసుల్లో ముగ్గురికి 20 ఏళ్లు, ఒకరికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ. లక్షల్లో జరిమానా పడిందన్నారు. తన విధుల్లో చక్కని దిశా నిర్దేశాలు చేసిన ఎస్పీ రాధికకు డీఎస్పీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రేవతి, చంద్రకళ, ఏఎస్సై విజయ్‌కుమార్, రైటర్ రాంబాబు ఉన్నారు.

పీవీకి భారతరత్నపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం: భారత ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేసిన దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం, పీవీ మన తెలుగుజాతివారు కావడంతో మనందరికి పండుగ వంటిదని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం జరిగిన సమావేశంలో వారంతా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసనాపు జోగినాయుడు, బీవీ రవిశంకర్, బీవీ దేవీప్రసాద్, గురు ఆనందరావు, గేదెల లక్ష్మి, రామ్‌బాయి, నాగేశ్వర ఈశ్వరరావు, బి.జగదీశ్వరరావు, డాక్టర్ జీఎన్ రావు ఉన్నారు.

బ్రాహ్మణ సంఘం..

శ్రీకాకుళం కల్చరల్: పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై జిల్లా బ్రాహ్మణ సంఘం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. బహుభాషా కోవిదులు నరసింహారావుకు అత్యున్నతమైన పురస్కారం ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సంఘం అధ్యక్షుడు గుమ్మా నగేష్, మాజీ ఎమ్మెల్యే కె.ఎ.ఎన్.భుక్త, ప్రతినిధులు భాస్కరభట్ల శ్రీరామశర్మ, వి.వి.ఎస్.ప్రకాష్, ఇప్పిలి శంకరశర్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని షిర్డీసాయిబాబా తత్వ ప్రచార మందిరం ప్రథమ వార్షికోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సామూహిక సాయి వ్రతాలు జరిగాయి. అనంతరం స్వామివారికి అఖండ భజన, మూడు హారతులు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు రెండువేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మందిరం చైర్మన్ ముద్దాడ అప్పలనాయుడు, బోర సన్యాసిరావు, కోరాడ శ్రీనివాసరావు, వరదా సత్యన్నారాయణ, దంపాక రమణమూర్తి, ముద్దాడ పద్మావతి ఉన్నారు.


అనకాపల్లి సీఐకి సన్మానం



సీఐ లక్ష్మణమూర్తి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత అనకాపల్లి సీఐ సీపాన లక్ష్మణమూర్తిని గ్రామస్తులు శనివారం సన్మానం చేశారు. జెడ్పీ హైస్కూల్‌లో రూ.4.50 లక్షలతో బహుళ ప్రయోజన షెడ్‌ను సొంత ఖర్చులతో నిర్మించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తాను చదవుకున్న పాఠశాలకు, గ్రామానికి సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యంతో చదవాలన్నారు. ప్రయోజకులైన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సహంతోపాటు గ్రామస్తుల భాగస్వామ్యం ఉంటే శరవేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. సర్పంచ్ బొడ్డేపల్లి గజలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గురుగుబెల్లి నర్సింగరావు, హెచ్‌ఎం లక్ష్మణరావు, ఎస్ఎంసీ చైర్మన్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు అన్నెపు శ్రీమన్నారాయణ, పప్పల వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

అయోధ్య-కాశీ యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



బస్సు వెనుక అతికించిన యాత్ర వివరాలతో కూడిన పోస్టర్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అయోధ్య- కాశీ యాత్రకు ప్రత్యేక బస్సును నడపనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలతో కూడిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. అయోధ్య-కాశీ యాత్రపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించేందుకే చర్యలు చేపట్టినట్లు ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరాజు, అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్‌లు పేర్కొన్నారు. యాత్రకు సంబంధించిన పోస్టర్లను అరసవల్లి దేవాలయం, శ్రీకూర్మం దేవాలయాల వద్ద, చిలకపాలెం నాన్‌స్టాప్ కౌంటర్, పల్లెవెలుగు బస్సులకు వెనుకభాగంలో అతికించారు. ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకూ అయోధ్య-కాశీ యాత్ర పేరిట వివిధ పుణ్యక్షేత్రాలను 10 రోజులలో దర్శింపజేసే అవకాశాన్ని ఆర్టీసీ చేపట్టిందని మల్లికార్జునరాజు చెప్పారు. ఇందుకోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ రూపొందించిందన్నారు. యాత్రకు వెళ్లేవారికి కోసం ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును నడుపుతోందన్నారు. ఒకొక్కరికీ చార్జీగా రూ.12 వేలు నిర్ణయించామన్నార. మరిన్ని వివరాల కోసం 73829 21647, 73829 19694, 73829 19696, 99592 25608 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఆర్టీసీ సిబ్బంది కె.సుమన్, గిరి, రమణమ్మ, చిన్నారావు ఉన్నారు.

రూ.6 లక్షలతో రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎం పురంలో రూ.6 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సిమెంట్ రోడ్డు, డ్రైనేజ్ పనులకు ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి శనివారం శంకుస్థాపన చేశారు. నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా రోడ్డులు, డ్రైనేజ్‌లు, ప్రభుత్వ భవనాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సర్పంచ్ కోన సూర్యారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నేతింటి సత్యనారాయణ, సత్తారు గోపి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

ఎచ్చెర్ల క్యాంపస్: దోమాం సమీపంలోని తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎచ్చెర్ల స్పెషల్ టీమ్, ఎచ్చెర్ల పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.75,130 స్వాధీనం చేసుకునట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయంతో లాభదాయకమన పంటలను మండలంలోని రైతులు పండిస్తున్నారని ప్రకృతి వ్యవసాయం సీఆర్పీ సూర్యనారాయణ తెలిపారు. పొన్నాడ పంచాయతీలో ప్రకృతి వ్యవసాయంపై, సేంద్రియ ఎరువుల తయారీపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వల్ల అధిక లాభాలు వస్తాయని, సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల పౌష్టికాహారం లభిస్తుందన్నారు.

పరామర్శ..



వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సాయికుమార్

జి.సిగడాం: మండలంలోని వాద్రంగికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బూరాడ వెంకటరమణ సోదరుడు బాబూరావు ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో నాయకులు ఆబోతుల జగన్నాథం, ఆనందపురం సర్పంచ్ చిత్తిరి మోహన్, ఎందువ జగన్ ఉన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి



నియామకపత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ విజయ

శ్రీకాకుళం: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని జెడ్పీ చైర్‌పెర్సన్ పిరియా విజయ అన్నారు. రికార్డు అసిస్టెంట్లుగా పని చేస్తూ పదోన్నతిపై జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికైన వారికి నియామకపత్రాలను శనివారం అందజేశారు. శ్రీకూర్మం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వై.గణపతిరావుకు జెడ్పీ కార్యాలయంలో జూనియర్ సహాయకులుగా పదోన్నతి లభించింది. అలాగే మెట్టవలస, తోలాపి, పొందురూ హైస్కూళ్లలో పనిచేసిన రికార్డు అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ ఉన్నారు.

బహిరంగ ప్రకటన

శ్రీకాకుళం జిల్లా మరియు పట్టణం చిన్నబొందిలీపురం, బాయమ్మతోట కాపురస్తులు బైరాగి పూర్ణచంద్రదాస్ ఇచ్చిన భోగట్టాపై ఈ ప్రకటన జారీ చేయడమైనది.

నా క్లయింట్ శ్రీ సఖియా మఠంనకు మహంతిగా వ్యవహరిస్తూ ఉన్నారు. ఇదివరలో బైరాగి తులసీబాయి ఆమె అనంతరం ఈమె ఏకైక కుమార్తె రామేశ్వరిబాయి, సదరు మఠంనకు మహంతిగా వ్యవహరిస్తూ తే 05.09.2017 దీ నాడు స్వర్గస్తులైనారు. ఈమె తన జీవితకాలంలో సదరు మఠం అభివృద్ధి చేస్తూ నిత్యపూజలు చేసిఉన్నారు. సదరు మఠంనకు ఇతరులకు ఎటువంటి సంబంధం లేదు. సదరు మహంతి రామేశ్వరిబాయి తన జీవితకాలంలో రిజిస్టర్ వీలునామా నా క్లయింటు పేరున వ్రాయడమైనది. నా క్లయింటు తే 05.09.2017 దీ నుండి పూర్తి హక్కులతో సదరు సఖియా మఠం స్వాధీనం చేసుకుని నిత్యపూజలు జరుపుతూ మఠంను అభివృద్ధి చేస్తున్నారు. నా క్లయింటు అనుమతి లేకుండా, శ్రీకాకుళం పట్టణ కాపురస్తులు వరుదు విజయ్‌కుమార్ మరియు ఎచ్చెర్ల మండలం, కుశాలపురం గ్రామ కాపురస్తులు పైడి రవి తండ్రి తాతయ్య, ఇతని వారసులకు ఎటువంటి హక్కు అనుభవం లేదు. సదరు వ్యక్తులు నామినర్ డాక్యుమెంట్లు తయారు చేసి నోటీస్ షెడ్యూల్ ఆస్తి కాజేయుటకు ప్రయత్నం చేస్తున్నారు. మరియు సదరు వ్యక్తులు నోటీస్ షెడ్యూల్ ఆస్తిని ఇతరులకు అన్యాక్రాంతలు మరియు క్రయవిక్రయాలు జరుపుటకు ప్రయత్నిస్తున్నారు. సదరు వ్యక్తులకు క్రయవిక్రయాలు జరుపుటకు ఎటువంటి హక్కులు లేవనియు మరియు నా క్లయింటుకు నష్టపరిచే దురుద్దేశంతో మరియు సదరు వ్యక్తులు లాభాపేక్షతో సదరు ఆస్తిని అక్రమంగా కాజేయుటకు ప్రయత్నం చేస్తున్నారు. అందువలన పై వ్యక్తుల ద్వారా జరుపు ఎటువంటి క్రయవిక్రయాలు గాని క్రయఅగ్రిమెంట్లు గాని చట్టరీత్య చెల్లనేరవు అని ఇందుమూలంగా తెలియజేయడం జరిగింది.

హద్దులు: తూర్పు: ఆర్.సి.సి. డాబాఇల్లు. **దక్షిణ:** బైరాగి పూర్ణచంద్రదాస్ గారి డాబాఇల్లు. **పడమర:** మఠం తాలూకా ఖాళీ స్థలం. **ఉత్తర:** రస్తా.

శ్రీకాకుళం
తేది: 09-02-2024

పి.అనంతరావు, అడ్వకేట్,
శ్రీకాకుళం. సెల్: 9440314248

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం మండలం, ఇప్పిలి గ్రామం కాపురస్తులు కరణం లేటు అప్పలరామన్న గారి కుమారుడు కరణం సీతరాజు యిచ్చిన భోగట్టా పైని జన యావన్మందికి యీ బహిరంగ ప్రకటన మూలంగా తెలియజేయునది! మా క్లయింటు సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములోగల శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం మండలం, ఇప్పిలి గ్రామం, సర్వే నం. 44/4రులో గల యు॥ 0-40 ట్లు లేక 0-160 హెక్టార్స్ మెట్టులో సరుగుడు తోట వేసివున్నారు. మా క్లయింటు సంపూర్ణ స్వాధీన హక్కు అనుభవంలో గల భూమిని యెట్టి హక్కులు లేకుండా మా క్లయింటును నష్టపరిచే దురుద్దేశంతో అతని భూమిని కబ్జా చేయుటకు శ్రీకాకుళం మండలం, ఇప్పిలి గ్రామం కాపురస్తులు కరణం లేటు అప్పలరామన్న గారి కుమారుడు కరణం గోవిందరావు, మరియు అతని కుమారుడు కరణం కైలాష్ రావు ఉరఫ్ కైలాష్ ప్రయత్నించగా, మా క్లయింటు మహారాజశ్రీ శ్రీకాకుళం, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందున O.S. 234/2019 నెంబరుగా Permanent Injunction దావా వేసివున్నారు. సదరు Permanent Injunction దావా లో I.A. 83/2019 in O.S. 234/2019 నందు Interim Injunction petition వేసివున్నారు. సదరు దావా పెండింగ్‌లో వుండగా సదరు విషయమును మభ్య పెట్టి సదరు దావాలో ప్రతివాదులు అయిన (1) కరణం గోవిందరావు (2) కరణం కైలాష్ రావు ఉరఫ్ కైలాష్ ఒక ఇరువురు ఆసామీలు ఇప్పిలి గ్రామం, సర్వే నం. 44/4రులో గల యు॥ 0-40 ట్లు లేక 0-160 హెక్టార్స్ మెట్టులో సరుగుడు తోటపై ఎట్టి హక్కులు అనుభవములు లేనపోయిన ఇతరులతో కుమ్మక్కు అయి క్రయ విక్రయాలు లావాదేవీలు జరుపుటకు ప్రయత్నించు చున్నట్లు నా క్లయింటుకు తెలియ వచ్చింది. కావున ఒక ఇరువురు ప్రతివాదులు అయిన (1) కరణం గోవిందరావు (2) కరణం కైలాష్ రావు ఉరఫ్ కైలాష్ తో దావా షెడ్యూలు విషయములో ఎవ్వరూ ఎట్టి లావాదేవీలు చేయరాదని, అట్లు అతిక్రమించి ఎట్టి లావాదేవీలు జరిపిన చట్ట విరుద్ధం అని, మా క్లయింటుకు సంబంధించినవనిన్నీ, అట్టి వారిపై మా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులు కాగలరని యీ బహిరంగ ప్రకటన మూలంగా తెలియజేయడమైనది.

దావా షెడ్యూలు వివరం

శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం మండలం, ఇప్పిలి గ్రామం, సర్వే నం. 44/4 రులో గల యు॥ 0-40 ట్లు లేక 0-160 హెక్టార్స్ మెట్టులో సరుగుడు తోటకు హద్దులు: **తూర్పు:** నీరుపారే బట్టి. **దక్షిణ:** కరణం సూరి సత్యం తాలూకా మెట్టు భూమి. **పడమర:** కరణం గోవిందరావు, వగైరా తాలూకా మెట్టు భూమి. **ఉత్తర:** నీరుపారే బట్టి.

శ్రీకాకుళం
తేది: 08-02-2024

సుధా సూర్యారావు,
కరణం అప్పలనాయుడు
అడ్వకేట్లు, శ్రీకాకుళం